
కథ

# మెరుపుతీగ

ఆంగ్లమూలం, అనువాదం : డా. కె.వి.ఎస్. జ్ఞానేశ్వరరావు



సమయం ఉషోదయానికి గంట ముందు. ఆ ప్రాంతంలో నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఏవో శబ్దాలు. వివేక్ లేచి బయట ఏం జరుగుతోందో చూసేందుకు బాల్కనీలోకి వచ్చాడు. ఆ చిమ్మచీకట్లో దగ్గర్లోనే వున్న రైలు పట్టాల వద్ద జనం మూగటం కనిపించింది. చేతుల్లో టార్చిలైట్ల కాంతి ప్రసరిస్తూ అస్పష్టంగా కొంతమంది హడావిడి చేస్తూ తిరుగుతున్నారు. క్రమంగా ఆ గందరగోళం ఎక్కువవుతోంది. అతను కూడా అక్కడికి చేరుకున్నాడు.

బెంగుళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రెండు బోగీలు పట్టాలు తప్పి ఆగి వుంది. డ్రైవరు సమయస్ఫూర్తి వల్ల పెనుప్రమాదం తప్పింది. సమతల ప్రదేశం కావడం వల్ల ప్రాణహాని లేకపోయినా గాయాలతో కొంతమంది మూలుగుతున్నారు.

హఠాత్తుగా ఆకాశంలో మెరిసే మెరుపుతీగ చందాన చేతిలో బ్రీఫ్‌కేసుతో ఒక అందాల యువతి అతనికి బెదురు చూపులతో ఎదురుపడింది.

'మేడమ్! మీకు నా సహాయం కావాలా?' – వివేక్ అడిగాడు.

'ఊఁ' – ఆమె కంఠస్వరం వీణ మీటినట్లుగా ఉంది.

'మీకేమైనా గాయాలు తగిలాయా?'

'లేదు'

'ఎక్కడి నుండి వస్తున్నారు?'

'తెలీదు'

'ఎక్కడికి వెళుతున్నారు?'

'తెలీదు'

'మీ పేరేమిటి?'

'తెలీదు'

ఆమెకి తలపై చిన్నదెబ్బ తగిలి తాత్కాలికంగా జ్ఞాపకశక్తి కోల్పోయిందని అతను భావించాడు.

'మీరు నిస్త్రాణగా కనిపిస్తున్నారు. బహుశా వైద్యసహాయం అవసరం కావచ్చు. నా వెంట వచ్చేందుకేమైనా అభ్యంతరమా?' ఆమె భీతహరిణేక్షణ అయింది. సమాధానం యిచ్చేందుకు కూడా ఆమె వద్ద శక్తి లేదు. వివేక్ ఆమె బ్రీఫ్ కేసు తీసుకుని తన అపార్టుమెంటు వైపు నడిచాడు. ఆమె అతనిని అనుసరించింది. అతను తలుపు తెరిచాడు. ఆమె బెదురుతూ లోనికి ప్రవేశించింది. అతడు పాలు కాచి యిచ్చాడు. ఆమె నెమ్మదిగా తాగింది. తర్వాత అనాలోచితంగా నడుముకి వేలాడుతున్న కీ చెయిన్ తాకి, తీసి బ్రీఫ్ కేసు తెరిచింది. దాని నిండా ఆమె డ్రస్సులు ఉన్నాయి. ఆమె అందులో దేనికోసమో వెతుకుతున్నట్లనిపించింది.

'మీ హేండ్ బ్యాగు ఏది?'

'ఎవరైనా తీసి ఉండవచ్చు. లేదా ట్రెయినులో ఉండి పోయిందేమో?'


'మీకు ఎవరిపేరైనా, ఎవరి ఫోన్ నెంబరైనా గుర్తుందా సంప్రతించేటందుకు?'

'ఏమీ గుర్తుకు రావడం లేదు'

'మీ తల్లిదండ్రుల పేర్లు?'

ఆమె చాలా ప్రయత్నించింది గాని ఫలితం సున్న.

'ఒకే. మేడమ్. ప్రస్తుతానికి స్నానం చేసి విశ్రాంతి తీసుకోండి. ఒక రెండు గంటలలోగా అన్నీ సర్దుకుంటాయి'.



అతని గది పక్కనే వున్న గెస్ట్ రూముకి ఆమెని తీసుకువెళ్లాడు.

***

కొడగులో సంపన్న కుటుంబానికి చెందినవాడు వివేక్. బెంగుళూరు సమీపంలో ఒక రెండంతస్తుల భవనంలో విశాలమైన అపార్టుమెంటులో ఉంటున్నాడు. అతను లలిత కళల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. అతను మెట్రోలోని చిత్రకారుల సమాఖ్యతో నిరంతరం సంబంధాలు నెరపుతూ విశ్రాంత జీవనం గడుపుతున్నాడు. అతను రాజారవివర్మ సంప్రదాయిక చిత్రాల నుండి యూరపులోని మైకేల్ ఏంజిలో, లియోనార్డో డావిన్సీల వంటి ప్రముఖ పునరుజ్జీవన చిత్రకారుల, శిల్పుల కళాఖండాలను నిశితంగా పరిశీలించి అవగాహన చేసుకున్నాడు. అతను భారతదేశంలోనే కాక విదేశాల్లో కూడా విస్తృతంగా పర్యటించాడు. అజంతా, ఎల్లోరా, శ్రవణ బెళగొళ, హళేబీడు, బేలూరు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఖాట్మండులోని దేవాలయాలు, కోణార్క, ఖజురహో, ఏథెన్సు రోమ్ నగరాల్లోని కళాఖండాలు అతనికి ఇష్టమైన ప్రదేశాలు. అంతర్జాతీయఖ్యాతిని చిత్రకారుడిగా సాధిద్దామనేది అతని జీవితాశయం. తృప్తితో జీవిస్తూ జీవితాన్ని ఆనందమయంగా గడిపే యువకుడతను. ఆ యువతి అతణ్ణి మంత్ర ముగ్ధుణ్ణి చేసింది. పగటి వెలుగులో ఆమెను పరిశీలించాడు. ఆమె అప్సరసలాగా ఆహ్వానిస్తూ, కవ్విస్తున్నట్లు, కైపెక్కిస్తూ ఉన్నది. అల్లిబిల్లిగా అల్లుకునే ఊహల్నీ, ఏవైనా ముందుకువేసే దుడుకు అడుగుల్నీ ఆమె మంగళ సూత్రం కట్టి పడవేయగా అతడు నిగ్రహంతో తమాయించుకున్నాడు.

***

పొద్దెక్కినాక వివేక్ ఆమెని నిమ్హాన్స్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లాడు. ఆమె తలకి దెబ్బతగిలిన కారణంగా తాత్కాలికంగా ఆమె జ్ఞాపకశక్తిని కోల్పోయిందని అక్కడి వైద్యనిపుణులు నిర్ధారించారు. మానసిక వైద్యుడు ఆమెకి కొన్ని మందులు సూచించి ఏ క్షణంలోనైనా అయత్నకృతంగా ఆమె జ్ఞాపకాల తోరణాలు పుంఖాను పుంఖాలుగా వెలికి రావచ్చునని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆమె ఫొటోని న్యూస్ మీడియాలోను, టీవీలోను ప్రసారం చేసి ఎవరైనా బంధువులు గాని, మిత్రులు గాని సంప్రతించవచ్చునని అతడు తలిచాడు. ఏదో ఒక ఆశాకిరణం వెలువడే వరకు అతనితో ఉండడానికి ఆమె సమ్మతించింది. ఆ సరికి ఆమెకి అతనిపై ఎనలేని గౌరవం, నమ్మకం కుదిరాయి.

***

ఒక రోజు వివేక్ స్నేహితుడు ఆనంద్ అడిగాడు.

'ఈ చిలుక ఎవరు? ఎక్కడి నుంచి కొట్టుకొచ్చావ్?'

'నోరు మూస్కోరా' వివేక్ మందలించాడు.

'ఓ! నీ గర్ల్ ఫ్రెండా? పెళ్లయిన దానిలా వుంది? ఆమెని ఎప్పుడు పెళ్లి చేసుకున్నావ్! ఎవరితో చెప్పాపెట్టకుండా!'

'అదంతా నీ కనవసరం'.

'ఆమె నీ గర్ల్ ఫ్రెండూ కాదు.... భార్య కాదు. నీతో కలిసి ఎలా వుంటోంది? బహుశా మనమో పట్టుపడితే...'

'దౌర్భాగ్యుడా... నేను తన్ని తగిలేసే లోపల పో బయటికి' వివేక్ అరిచాడు. వాడు కుక్కిన పేనులా బయటికి పోయాడు. లోపలి గదిలో వున్న ఆమెకి ఈ గొడవ ఎంతమేరకి వినిపించిందో వివేక్‌కి తెలీదు.

***

ఒక రోజు మునిమాపు వేళ వివేక్ యింటికి తిరిగి వచ్చాడు. అతను లోలోన చీదరగా అనిపించి వేడినీళ్ల షవర్ తీసుకోవాలనుకున్నాడు. బాత్రూం తలుపు దగ్గరగా వేసి వుంది. ఆ తలుపుని నెమ్మదిగా నెట్టాడు. అది నిశ్శబ్దంగా తెరచుకుంది. అతను అప్రతిభుడై విద్యుదాఘాతం తగిలినట్లు అచేతనుడై అవాక్కుగా నిలబడిపోయాడు. ఆమె షవర్‌కింద నగ్నంగా రతీదేవి మాదిరి నిలబడి వుంది. నులివెచ్చని నీటిధారలు ఆమె నిమ్నోన్నతాలపై జాలువారుతున్నాయి. మెరుపులా మిరుమిట్లు గొలిపే ఆ దృశ్యం అతని అక్షి ఫలకాన్ని పిడుగుపాటులా తాకింది. అతని నరనరాల్లోను రక్త నాళాల్లోను ఎడ్రినలీన్ వేగంగా ప్రవహించింది. అతని గుండె కుత్తుకలో చిక్కుకుంది. అతను తలుపుదగ్గరగా వేసి బయటి గోడకి వెన్నుఆసరగా ఆనుకుని నిలిచాడు. ఒళ్లంతా చెమటలు కమ్మాయి. కాని ఆ ప్రతిబింబం అతని మనోఫలకంపై చెక్కినట్లుగా ముద్రించబడింది. ఆమె రెనాల్టు చిత్రించిన 'మెట్ల వద్ద నిలిచిన నగ్నసుందరి' యా? ఆవేశం పెల్లుబికి అతను నిగ్రహం కోల్పోయే దశకి చేరుకున్నాడు. ఏ క్షణంలోనైనా అతను వివేకం కోల్పోయే అవకాశం వుంది. ఉన్నపళంగా మేడమెట్లు దిగి కారు స్టార్టు చేశాడు. గమ్యం లేని కారు దిగంతంలోకి దూసుకుపోయింది.

***

వివేక్ అర్ధరాత్రి దాటాక యింటికి వచ్చాడు. టేబిల్‌పై డిన్నరు రెడీగా వుంది. గెస్ట్ రూం తలుపు కొద్దిగా తెరచి వుంది. అతడు లోనికి చూశాడు. ఆమె పల్చటి నైటీలో పసిపాపలా గాఢ నిద్రలో వుంది. యువకుడైన అతని మనోభావాలు పరిపరివిధాల పరుగులెత్తాయి. ఆమె గది తలుపు ఎందుకు గడియ పెట్టుకోలేదు? బాత్రూం తలుపు విషయంలో ఎందుకు అశ్రద్ధ వహించింది? పొరపాటున అలా చేసి వుంటుందా? లేక బుద్ధిపూర్వకంగా అలా చేసిందా? ఆమె తనను రెచ్చ గొడుతోందా? ఆమె నిజంగానే అమాయకురాలు, పసితనంతో ప్రవర్తిస్తోంది అనుకోవాలా? – పరిసరాలతో ప్రమేయం లేకుండా! ఏమైనా ఆడువారి మాటలకి అర్థాలే వేరులే! స్త్రీ బుద్ధి ఎవరి కెరుక? క్షణికమైన ఆమె అంగాంగ శోధనలో ఆమె ఎన్నడూ తల్లి కాలేదని, బహుశా అనాఘ్రాత పుష్పమైన అవివాహిత అనీ గ్రహించాడు.

ఆమెని ఏం చెయ్యాలో ఎవరికి వప్పజెప్పాలో వివేక్‌కి అర్థం కాలేదు. మీడియాలో ఆమె ఆచూకీ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసి నెల రోజులు కావస్తోంది. ఎవరూ అతనిని కలుసుకునే ఆసక్తి చూపలేదు. ఎవరూ అతనిని కలుసుకోలేదు. వారిద్దరి మధ్య జరగకూడనిది ఏమీ జరగ లేదు. కాని ఇలా ఎంతోకాలం సాగదని అతనికి తెలుసు.

ఒక మధ్యాహ్నవేళ ఆ యువతికి ఏమీతోచక అతని స్టూడియోలోకి ప్రవేశించింది. అదంతా చిందరవందరగా, అస్తవ్యస్తంగా కనిపించింది. ఈజెల్, రంగులు, బ్రష్‌లు వగైరా చిత్రకళ సామగ్రి ఎక్కడపడితే అక్కడే పడి వుంది. ఆమె టేబులుని సర్ది గది ఊడ్చింది. బోర్డుపై అసంపూర్ణంగా చిత్రించిన చిత్రాన్ని సరియైన స్థానంలో వుంచింది. అక్కడ ఒకమూలగా పెద్ద భోషాణం పెట్టి వుంది. ఆసక్తితో ఆమె దానిని తెరిచింది. అందులో కొన్ని పెయింటింగ్సు ఉన్నాయి. వాటిలో ఒకటి తాజాగా చిత్రించినట్లుంది. దానిని పగటి వెలుగులోకి తెచ్చి చూసింది. అందులో అద్దంలో మాదిరిగా తన ప్రతిబింబం కనపడింది. దాని శీర్షిక చదివింది.... 'జలధార క్రింద నగ్నసుందరి'... దానిని చూడగానే ఆమె భ్రుకుటి ముడివడింది. మళ్లీ దానిని యథాస్థానంలో వుంచింది. స్టూడియో నుండి వడివడిగా బయటికి నిష్క్రమించింది.

***


బ్రేక్‌ఫాస్టు తర్వాత వివేక్ తీరిగ్గా ఏదో ఆర్ట్ మేగజైను తిరగేస్తున్నాడు. ఆమె వచ్చి నెమ్మదిగా పలకరించింది.

'సార్! మీరు న్యూడ్స్ పెయింట్ చేస్తారా?'

ఉరమని పిడుగులా తగిలిన ప్రశ్నకి తత్తరపడి మాటల కోసం వెతుక్కున్నాడు. ఉన్నత వంశానికి చెందినట్లున్న ఆమెకి ఏమని సమాధానం చెప్పాలి? క్షణం ఆగి అన్నాడు–

'ఔను. మా వృత్తిలో అది సర్వసాధారణం, గౌరవప్రదం, వాణిజ్యంలో ఉపకరించేది'.

'మీరు సజీవ మూర్తులతో పని చేస్తారా? ఊహల



పల్లకిలో పయనిస్తారా?' – ఇది మరో గడ్డు ప్రశ్న!

'మేము రెండూ ఉపయోగిస్తాం' ఆమె ప్రశ్నలు అతడిని విభ్రాంతికి గురిచేసి కలవర పెట్టాయి. తన కళాఖండాలని ఆమె తిలకించిందా? అతనికి స్టూడియోని గాని, పెట్టెలని గాని తాళం వేసి వుంచే అలవాటు లేదు. తాను తాజాగా చిత్రించిన, ప్రస్ఫుటంగా ఆమె పోలికలు వున్న నగ్న కళా ఖండాన్ని గాని ఆమె చూడడం తటస్థించిందా? ఆమె తనని గురించి ఏమనుకుంటుంది? తన హృదయంలో ఆమెని గురించి కామపూరితమైన పాప భూయిష్టపు ఆలోచనలు చీకట్లు ముసురు కుంటున్నట్లు అనుకోదూ? అతని వైఖరి కళా విహీనంగా మారింది.

***

మధ్యాహ్నం అతడు తిరిగి వచ్చేవేళకి అతని ఫ్లాట్‌లో నుండి భయవిహ్వలమైన కేకలు వినిపించాయి. అతడు సుడిగాలిలా పైకి చేరుకున్నాడు. ఆశ్చర్యంగా అక్కడ ఆనంద్ ఆమెని గోడకి అదిమిపెట్టి కలువ మొగ్గల మధ్య ముద్దు పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. భయంతో బెదిరి వణుకుతూ పెనుగులాడుతూ ఆమె వాడి పట్టు నుండి విదిలించుకునే ప్రయత్నంలో వుంది. ఆమె నుదట గాయమై రక్తం స్రవిస్తోంది. మెరిసే ఆమె చెంపలపై కన్నీరు జాలువారుతోంది ఏకధారగా. వివేక్ ఆనంద్‌పైకి సింహంలా దూకి ఆమెని విడిపించి పిడికిళ్లతో గుద్దుతూ, డొక్కలో తంతూ నేలపై కూల్చి మెట్లపై నుండి క్రిందికి తోశాడు.

'నికృష్టపు వెధవా. మళ్లీ జన్మలో నీ పాపిష్టి మొహం నాకు చూపకు' అని ఉరిమాడు వివేక్.

దొర్లుకుంటూ కిందికి చేరిన ఆనంద్ మొహం పచ్చడి అయింది. రక్తం కారుతుండగా వాళ్లిద్దరినీ తిట్టుకుంటూ రోడ్డు మీదకి పోయాడు. కొద్దిగా చినిగిన బ్లౌజుతో ఆమె సగం స్పృహతో నేలపైకి ఒరిగి వుంది. వివేక్ ఆమెని ఎత్తుకుని వెళ్లి దివాన్ కాట్‌పై పరుండబెట్టి గాయాన్ని శుభ్రపరచి బ్యాండేజ్ వేశాడు. కొద్దిసేపు పోయాక ఆమె నెమ్మదిగా తామర రేకుల వంటి విశాల నేత్రాలు తెరచి చూసింది.

'జరిగిన దానికి ఎంతో విచారిస్తున్నాను. ఇక మీదట అలా ఎన్నటికీ జరగనివ్వను' – వివేక్ మనపూర్తిగా ఆవేదన వ్యక్తం చేశాడు.

'థాంక్స్' – నిట్టూర్చి కళ్లు మూసుకుంది.

***

ఒక ఉదయం తోటలో బాటపై వివేక్ చింతాక్రాంతుడై నడక వ్యాయామంగా సాగిస్తున్నాడు. మీడియాలో ఎన్నో మార్లు ఆమె గురించి ప్రకటనలు గుప్పించినా ఆమె కుటుంబ సభ్యులు గాని, స్నేహితులు గాని తనని సంప్రతించక పోవడం అతనిని ఆశ్చర్యపరిచింది. వారి మనస్తత్వం ఎటువంటిది? అందులో రహస్యమేమిటో అంతుపట్టడం లేదు. ఆ స్థితిలో ఆమెని ఎన్నాళ్లో తన వద్ద ఉంచడం అసాధ్యం గనుక ఆమెకొక దారి చూపాలి – అనుకున్నాడు.

హఠాత్తుగా అతని తలపై దెబ్బలు పడి, రక్తం చింది ఆ నిర్జనమైన బాటపై అతను కుప్పకూలాడు.

***

స్టెరిలైజ్ చేసిన ఆ స్పెషల్ వార్డు చల్లగా ఉంది. వివేక్ తలపై ఎగువగా గోడపై సౌమ్యంగా ఒక బల్బు వెలుగుతోంది. మెడ నుండి కాళ్ల వరకు తెల్లటి బట్ట కప్పబడి వుంది. అతని తలకి కట్టు వుంది. నుదుటిపై చెంపలపై గాయాలు తగిలి ఆయాభాగాలు ఎర్రగా కమిలి వున్నాయి. కంటి చుట్టూ నల్లటి చారలు ఏర్పడ్డాయి.

ఆ యువతి నారింజ రసం గ్లాసుతో తెచ్చి అతనిని లేపి తాగించింది. అతను మౌనంగా కృతజ్ఞతలు తెలిపాడు.

'సార్! స్కానింగ్ రిపోర్టుల ప్రకారం అదృష్టవశాత్తూ మెదడుకి దెబ్బ తగల్లేదు. ప్రస్తుతం ప్రమాదస్థితి దాటినా రెండు మూడు రోజులు గమనించి యింటికి పంపుతారు. గాయాలు మానినాక మచ్చలు కూడా ఏర్పడవని చెప్పారు. అదొక శుభ పరిణామం. ఇది దెబ్బ

మిలమిల మెరిసే తారకల మధ్య వెండి వెన్నెల విరబూసిన రాత్రి అది. పూల తోట మీదుగా వీచే చల్లటి హాయిగొలిపే మందమలయానిలం సుగంధ భరితమై వుంది. పున్నమినాటి నెలరేడు మెల్ల మెల్లగా ఆకసంలో ఎగసి ఎగసి పైకిపోతుంటే అప్సరసలా మెరిసిపోతున్న పవిత్ర తదేకంగా చూస్తోంది. ఆమె మనసు మధురమైన స్వప్నాలు ఊహిస్తుండగా ఆమె ఎద ఉద్వేగంతో ఎగసి పడుతోంది. చూపులో ప్రశ్నార్థకం తొణికిసలాడగా వివేక్ అక్కడికి వచ్చాడు. భువన మోహనమైన ఆమె చిరునవ్వు ఆహ్వానం పలుకుతోంది. పూచిన లతల్లా సాచిన ఆమె బాహు పరిష్వంగంలోకి అతడు జాలువారాడు.

తిన్న మీ స్నేహితుడి వ్యూహమే అని బలంగా నమ్ముతున్నాను. మీ పరిస్థితిని మీ తల్లిదండ్రులకి కబురు చేశారు. మీ ఆతిథ్యాన్ని చాలా రోజులు అనుభవించాను. ఇంక సెలవిప్పించండి'

'అరె! అదేమిటి? ఇన్నాళ్లయినా మీ పేరుగాని వివరాలు గాని ఏమీ తెలియరాలేదు. ఐనా ఫరవాలేదు. దయచేసి నన్ను వదలి ఎక్కడికీ వెళ్లకండి' – అతను ప్రాధేయ పడ్డాడు.

'మీ తల్లిదండ్రులు వచ్చి మీ బాగోగులు చూసుకునేవరకు ఉంటాను. వివేక్... నన్ను పవిత్ర అని పిలవవచ్చు. మిగిలిన వివరాలు తర్వాత చెప్తాను'.

'ఏమిటేమిటి?'

'ప్రస్తుతం పూర్తిగా విశ్రాంతి తీసుకోండి అంటున్నాను'. ఆమె నెమ్మదిగా, స్థిరంగా చెప్పింది.

ఆమె చేతిని అతడు ఆప్యాయంగా మృదువుగా నొక్కుతుండగా అతను మగతలోకి జారుకున్నాడు.

చివరిగా అతని జ్ఞాపకపు పొరలతో ముద్రించబడినది అతని నుదుటిపై సుతారంగా ఆమె లేత పెదవులు పెట్టిన చుంబనం.

***

చిత్రకళా పరిషత్ సమీపంలో గల 'వేలం పాట' భవనంలో చాలా సంఖ్యలో జనం పోగు పడ్డారు. అందులో ప్రముఖ సభాభవనంలో ఆర్టు గ్యాలరీలోకి పవిత్ర వివేక్ ప్రవేశించారు. అక్కడందరూ వాళ్లిద్దరినీ భార్యాభర్తలుగా భ్రమ పడ్డారు. వివేక్ గీసిన చిత్రాలన్నీ అనూహ్యమైన విలువలు సంతరించుకుని అమ్ముడుపోయి చిన్న నిధికి సమానమైనాయి. పేరు మోసిన ఆర్టిస్టుల చిత్రాలు సగానికి సగం మిగిలిపోగా వివేక్ సాధించిన ఘన విజయం పవిత్ర సాన్నిధ్యం మూలంగానేనని నమ్మాడు. ఆ ఊహని రహస్యంగా తన గుండెల్లో పదిలపరచుకున్నాడు. ఆ ఆక్షన్ ముగింపులో యిచ్చే పసందైన విందు ఆరగించి ఇంటిదారి పట్టారు.

***

మిలమిల మెరిసే తారకల మధ్య వెండి వెన్నెల విరబూసిన రాత్రి అది. పూల తోట మీదుగా వీచే చల్లటి హాయిగొలిపే మందమలయానిలం సుగంధ భరితమై వుంది. పున్నమినాటి నెలరేడు మెల్ల మెల్లగా ఆకసంలో ఎగసి ఎగసి పైకిపోతుంటే అప్సరసలా మెరిసిపోతున్న పవిత్ర తదేకంగా చూస్తోంది. ఆమె మనసు మధురమైన స్వప్నాలు ఊహిస్తుండగా ఆమె ఎద ఉద్వేగంతో ఎగసి పడుతోంది. చూపులో ప్రశ్నార్థకం తొణికిసలాడగా వివేక్ అక్కడికి వచ్చాడు. భువన మోహనమైన ఆమె చిరునవ్వు ఆహ్వానం పలుకుతోంది. పూచిన లతల్లా సాచిన ఆమె బాహు పరిష్వంగంలోకి అతడు జాలువారాడు. జీవితంలో మొదటిసారిగా ఆమెని తన విశాలమైన ఛాతీకి గట్టిగా హత్తుకున్నాడు.

ఆమె తన మంగళసూత్రాన్ని తీసి గాలిలోకి విసిరేసింది. క్షణంలో అది కనుమరుగయింది.

'వివేక్! మీకూ, మీ తల్లిదండ్రులకీ నా కథ వినిపించాను. మీ పెద్దవారికి కూడా నేను నచ్చాను. నన్ను మీరు ఇష్టపడితే నాపై వర్ణచిత్రం గీయండి' – ఆ అతిలోక సుందరి అతనిచెవిలో రహస్యం చెప్పింది. ఆమె పరిపూర్ణ స్త్రీత్వపు అగ్నిజ్వాల అతడిని ఆకర్షించి కమ్మివేసింది. మరుక్షణం వాళ్లిద్దరూ పురాణాల్లోని 'మనువు – శతరూప'లుగా మారారు. ఆ రెండు పవిత్రాగ్నులు ఊహించరానంత ఆవేశంతో బలంగా పెనవేసుకున్నాయి.

వివేక్ ఏడు మల్లెపువ్వుల స్నిగ్ధ సుకుమారియైన తన సజీవ 'జలధార క్రింద నగ్న సుందరి'ని సప్త వర్ణాలతో చిత్రించే నిమిత్తం బెడ్‌రూంలోకి ఎత్తుకుని వెళ్లాడు. వాళ్లిద్దరి మధ్యా చాలాసేపు కాలం అర్థాన్ని కోల్పోయింది.

*

**చిరునామా:**
**డా. కె.వి.ఎస్.జ్ఞానేశ్వరరావు,**
**హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్,**
**డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్,**
**శ్రీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మరలూర్,**
**తుమ్‌కూర్ – 572 105, కర్నాటక.**
**ఫోన్: 099860 96507**